# కథాకేళి



# మాతృదేవోభవ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలోని ఓ కేంద్ర ప్రభుత్వ సంస్థ అకౌంట్స్ తనిఖీ చేయడానికి నేను, మరో ఇద్దరు కొలీగ్స్ వెళ్లాం. మాకు ఆ కంపెనీ గెస్ట్ హౌస్‌లో బస. అది ఓ అడవి మొదట్లో, రహదారి పక్కన సత్నా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వుంది.

రోజూ ఆ కంపెనీ కారు వుదయం వచ్చి మమ్మల్ని ఆఫీసుకి తీసుకెళ్లి సాయంత్రం మళ్లీ గెస్ట్ హౌస్‌లో దింపుతుండేది. దేశంలోని వివిధ రాష్ట్రాల నించి వచ్చిన వుద్యోగస్థులు అక్కడ పనిచేస్తుండేవారు. కాని మా గెస్ట్ హౌస్, ఆఫీసుని ఊడ్చే మనిషి మటుకు హిందీ తప్ప ఇంకే భాషా రాని ఓ నలభై ఏళ్ళ పడుచు. ఆమె పేరు మెహందీ.

రోజూ వుదయం నన్ను నిద్ర లేపేది. బెడ్ టీ తాగుతూ పిచ్చాపాటి మాట్లాడేవాణ్ణి మెహందీతో. స్వచ్ఛమైన హిందీ మాట్లాడే మెహందీ వుర్దూ కలిసిన హైద్రాబాద్ హిందీకి నవ్వేది.

క్రమంగా ఆమె గురించిన సమస్త సమాచారం తెలిసింది. ఆమెకి పెళ్లయి ఇరవై ఎనిమిదేళ్లయింది. ఆరుగురు పిల్లలు. ఏడోసారి గర్భవతి అయింది. ఇంకో రెండు నెలల్లో కానుపు వస్తుంది. ఉండేది అడవిలోని తండాలో. ఆమె భర్త కులవృత్తిరీత్యా కల్లు తీస్తుంటాడు. నెలకి ఏభై రూపాయలిస్తుంది కంపెనీ, గెస్ట్ హౌస్ వూడ్చినందుకు. ఆఫీసు వూడిస్తే రోజుకి మూడు రూపాయిల చొప్పన యిస్తారు.

రెండు ప్రపంచ యుద్ధాలు సంభవించాయని గాని, ఇండియాని బ్రిటిష్‌వాళ్లు రెండు వందల ఏళ్లు పాలించాక మనకి దాదాపు నలభై ఏళ్ళ క్రితం స్వాతంత్ర్యం వచ్చిందని కాని, మానవుడు చంద్రుడి మీద కాలు పెట్టాడని గాని మెహందికి తెలియదు. అదే కాదు. ఇంకా చాలా తెలియదామెకి.

మెహందికి తెలిసిందల్లా గోధుమ పిండితో అనేక రకాల రొట్టెలు, అందులోకి కూరలు చేయడం. అంతకు మించి మెహందికి పూర్తిగా తెలిసిందేమీ వుండదనిపించింది నాకు. ఆమె తండాలోని అందరి లాగే ఆమెకీ బయటి ప్రపంచంతో సంబంధం లేదు.

ఓ రోజు నేను వుదయం మను వెచ్చటి ఎండకోసం నిద్ర లేచాక బయటికి వెళితే గెస్ట్ హౌస్ ముందు పెంచిన గులాబీ తోటలో నా కాళ్ల కింద నించి చరచర పాకి వెళ్లిందో గోధుమ వన్నె తాచుపాము. అడుగున్నర పొడవు వున్న అది సన్నగా వుంది. నేను గజగజ వణుకుతూ గెస్ట్ హౌస్‌లోకి పరిగెత్తాను. నా భయాన్ని గుర్తించిన మెహంది అడిగింది ఏమైందని.

పాము గురించి చెప్పాను. చిన్నగా నవ్వి చెప్పింది–

''మనం వాటిని ఏం చేయకపోతే అవి మనల్నేం చేయవు.

'' కాని మండ్రగబ్బలు కాని, తేళ్లు కాని పుట్టి పుణ్యానికే కుడతాయి''

మేం వున్న ఆ ఏరియాలో తేళ్లు, మండ్రగబ్బలు, పాములు అధికంగా వున్నాయని కారు డ్రయివర్ మొదటి రోజే చెప్పాడు. మండ్రగబ్బ కరిస్తే మందే లేదట. ఎర్ర తేళ్లు కరిస్తే ఇరవై నాలుగు గంటలు, నల్ల తేళ్లు కరిస్తే ముప్పై ఆరు గంటల దాకా విషం దిగదని కూడా చెప్పాడు.

మెహందికి అడవిలో పుట్టి పెరగడం వల్ల కావచ్చు పట్నవాసం వాళ్లలా అవంటే భయం లేదు.

ఆ రోజు ఆఖరి రోజు. ఆ రాత్రే మేం తిరిగి హైద్రాబాద్ బయలుదేరుతున్నాం. ఆడిట్ రిపోర్ట్‌ని ఫైనలైజ్ చేస్తుంటే ఆఫీసులోని వాళ్లంతా బయటికి పరిగెత్తడం చూసి నేనూ వాళ్లతో బయటకి వెళ్లాను.

మెహంది కుడిచేతిని గట్టిగా విదిలిస్తూ బాధగా అరుస్తోంది. ఎవరో చెప్పుతో పక్కనే వున్న నల్ల తేలుని బాది బాది చంపుతున్నారు.

''తేలు కుట్టిందిట'' చెప్పారు ఎవరో నాకు అడగకుండానే.

''అరెరె నల్ల తేలులా వుందే. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లండి'' చెప్పాను నేను.

క్షణాల్లో డ్రయివర్ జీప్ తెచ్చాడు కంపెనీ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లడానికి. మెహంది జీప్ ఎక్కలేదు. డాక్టర్ దగ్గరకి వెళ్లడానికి వప్పుకోలేదు.

''ఇంజక్షన్ ఇస్తాడు డాక్టర్. నొప్పి తగ్గుతుంది'' బాధతో మెలికలు తిరుగుతున్న మెహందితో అకౌంట్స్ ఆఫీసర్ చెప్పాడు.

''రాను'' చెప్పింది మెహంది.

''తేలు కుట్టినట్టు కూడా వుండదు ఇంజక్షన్'' చెప్పాడు డ్రయివర్.

''ఊహూఁ!నేను కావాలనే కుట్టించుకున్నాను'' చెప్పింది మెహంది.

అందరం ఆశ్చర్యపోయాం.

''ఏమిటి? కావాలనే తేలుతో కుట్టించుకున్నావా?'' ఆశ్చర్యంగా అడిగాను.

''అవును'' జవాబు చెప్పింది.

''ఓసి తెలివి తక్కువదానా! ఎందుకా పిచ్చి పని చేసావు? పైగా గర్భవతివి కూడా'' అరిచాడు మళయాళీ క్లర్క్.

''ఏడో నెల నిండాక తల్లి వంట్లోకి తేలు విషం ఎక్కితే పుట్టాక ఆ బిడ్డకి తేలు ఎప్పుడు కుట్టినా ఆ నొప్పి తెలీదు–అందుకని. ఇది మొదటిసారి కాదు. ఇంతకుమునుపు కానుపులకి ముందు కూడా ఇలాగే కుట్టించు కున్నాను'' చెప్పింది మెహంది. ఆమె మాటలు విన్నాక నాకనిపించింది – ఆమెకి బిడ్డ పుట్టాక ఆ బిడ్డ కొలిచే దేవతకి మొహం అంటూ వుంటే అది అచ్చం మెహంది మొహంలా వుంటుందని.

